# నాకో తృప్తి చాలు!

పేరేపు లక్ష్మి

కాలేజీ నుంచి వచ్చిన అపర్ణ కాళ్ళూ, చేతులూ, ముఖం కడుక్కుని పినతల్లి తాయారమ్మ తెచ్చి అందించిన వేడి వేడి టీ తాగి తన గదిలో కుర్చీలో కూర్చుని రెండు కళ్ళూ మూసుకుని రిలాక్సింగ్‌గా వెనక్కు వాలింది.

పది నిమిషాల తర్వాత తన బాగ్ తెరిచి అందులో నుంచి తను ప్రమీల నడిగి తెచ్చుకున్న నవల 'లవ్ మేరేజ్' తీసింది. పిన తల్లి చూస్తే కళ్ళెర్ర జేస్తుంది. బాబాయి చూస్తే "ఈ నవలలు, కథలు చదవడాని కైతే తల్లి దండ్రులని వదిలి ఇంత దూరం మా దగ్గర చదువు వెలగబెట్ట నక్కర్లేదు" అని రేపే బం డెక్కించేస్తాడు.

అన్నయ్య చూస్తే నరే సరి! పిన్ని వంటింట్లో వంట చేసుకుంటోంది. బాబాయి సాయంకాలం కావడంతోనే అలవాటు ప్రకారం అలా బీచ్ వైపు షికారుకి వెళ్ళాడు. అన్నయ్య ఫ్రెండ్స్‌తో తిరగడానికి వెళ్ళాడు. స్వాతి ఇంకా నైన్త్ చదువుతోంది. పెద్దగా ఏం తెలియదు. పైగా తనంటే ప్రాణం "అక్కా! అక్కా!" అంటూ తను ఇంట్లో ఉన్నంతసేపూ తనతోనే తిరుగుతూ ఉంటుంది. తను చూసినా పెద్ద ప్రాబ్లమ్ లేదు.

నవల తీసి దానికి పైన కవర్ వేసి దాని మీద తన పేరు, కాలేజి పేరు, 'సెకండ్ బి.ఎస్‌సి., బయాలజీ' అని రాసింది అపర్ణ - పొరపాటున ఎవరి కంట పడినా అనుమానం రాకుండా. ఇటూ అటూ చూసి అన్ని జాగ్రత్తలూ మరోసారి జాగ్రత్తగా పరిశీలించుకుని మొదటి పేజీ తెరిచింది. "అమ్మయ్య! ఇక గంట వరకు ఏం పరవాలేదు. ఈలోగా నగం, కనీసం నాలుగోవంతు నవల అయినా పూర్తి చేసేయ్యవచ్చు' ననుకుంటూ. అట్టమీది బొమ్మ వేసిన తీరు అపర్ణ నెంతగానో ఆకట్టుకుంది - ప్రేమపక్షులు రెండు జంటగా ఆకాశంలో విహారం చేస్తున్నట్లు, కింది నుంచి కొత్తగా పెళ్ళి అయిన జంట ఆ 'జంట'ని తిలకించి నవ్వుకుంటున్నట్లు!

గడియారం ఆరు గంటలు కొట్టింది. అపర్ణ తుళ్ళిపడింది. అంటే తను కవరు పేజీ చూస్తూండగానే ఇరవై నిముషాలయిందా? మరి నవల పూర్తి చేసే దెప్పుడు? రెండు రోజులలో ఇచ్చేయ మంది ప్రమీల. మళ్ళీ రేపు ప్రాక్టికల్స్ .. ఇంటికి వచ్చాక రికార్డులు రాసుకోవడంతో సరిపోతుంది. నవల చదివే తీరుబాటే ఉండదు. ఏమైనా నరే ఈ రోజు నగమైనా పూర్తి చేయా లన్న పట్టుదలతో కుర్చీలో సర్దుకుని కూర్చుంది అపర్ణ. అక్షరాల వెంట ఆమె కళ్ళు పరుగులు తీస్తున్నాయి.

'సృష్టిలో అన్నింటికంటే తీయనిది ప్రేమ ...
ఈ సృష్టిని జయించే శక్తి ఒక్క ప్రేమకే ఉంది.
'ప్రేమ' అన్న రెండక్షరాలలో అనంతమైన శక్తి ఉంది ...'

ఇలా ప్రారంభమైన ఆ నవల అపర్ణను ఆ 'ప్రేమ' లోకంలోకి అవలీలగా తీసుకుని వెళ్ళిపోయింది. పరిసరాలను పూర్తిగా విస్మరించి అందులో లీనమైన సమయంలో తాయారమ్మ పిలిచింది.

"అపర్ణా!" రెండు మూడుసార్లు పిలిచినా పలికి ఊరుకోవడంతో తప్పనిసరి అయి గదిలోకి వచ్చింది. దీక్షగా పుస్తకంలో నిమగ్నమైన అపర్ణను చూసి "ఈ రోజు కాలేజీ వర్క్ ఏమైనా ఎక్కువగా ఉందా?" అంది టేబులు దగ్గరగా వచ్చి.

"లేదు ... అవును పిన్నీ! రేపు ప్రాక్టికల్స్ కదా ఇవాళ బాగా ప్రిపేర్ అవుదా మని ..." అంది పుస్తకాన్ని మూసి తత్తరపాటును కప్పిపుచ్చుకుంటూ.

"ఏమ రేం లేదు. పార్వతమ్మ గారి అమ్మాయికి నొప్పులు వస్తున్నాయని హాస్పిటల్లో జాయిన్ చేశారట. ఆవిడ కంగారు పడుతున్నారు నన్ను రమ్మని కబురు చేశారు. స్టవ్ మీద కూర ఉంది. కాస్త మాడిపోకుండా చూసి వేయించు. నేను వచ్చేసరికి చాలా ఆలస్యం మవుతుం దేమో! బాబాయీ, అన్నయ్యా వస్తే వడ్డించు. నువ్వూ,



స్వాతీ కూడా భోజనం చేసి పడుకోండి. నా కోసం ఎదురు చూడకండి'' అని నాలుగు పనులూ పురమాయించి తాయారమ్మ హాస్పిటల్‌కి వెళ్ళిపోయింది.

అన్నింటికీ 'అలాగే' అని గంగి రెద్దులా తలూపిందే గాని అపర్ణకి చిర్రెత్తు కొచ్చింది. అసలే ఆ నలవ చదవడానికి టైం చాల దనుకుంటూ ఉంటే ఇ దొకటి! కస్సు బుస్సు మంటూ లేచి వెళ్ళి స్టవ్ దగ్గర కుర్చీ లాక్కుని కూర్చుంది. సరిగ్గా ఇప్పుడే నవల మంచి ఇంటెరెస్టింగ్‌గా ఉంది. మొదటిసారి హీరో హీరోయిన్ల పరిచయం బీచ్‌లో ఇద్దరూ ఒకరి నొకరు కన్నార్పకుండా చూసుకుంటున్నారు. అలా ఇద్దరూ మౌనంగా ఒకరి పక్క నొకరు బీచ్ ఒడ్డున నడుస్తున్నారు. ఇంతలో హీరోయిన్ కాలు స్లిప్ అయి పడబోతుంటే హీరో చెయ్యి అడ్డు పెట్టడంతో ఆమె జడలోని సన్నజాజుల పరిమళం అతని నరనరాల్లోనూ మత్తును రేకెత్తిస్తోంది.' చదువుతున్న అపర్ణ కూడా పరవశత్వంతో గట్టిగా ఊపిరి పీల్చింది.

అప్పుడు తెలిసింది అపర్ణకి సన్నజాజుల వానన కాక స్టవ్ మీద కూర నల్లగా మాడిన వానన.



ఒక్క ఉదుటున లేచి నవల డ్రాయర్ సొరుగులో పెట్టి వచ్చింది. అడు గంత నల్లగా మసి బొగ్గులా మాడిన కూరని చూస్తూ ఉంటే ఏడు పొచ్చింది అపర్ణకి. ఏం చేయాలో దిక్కు తోచక నిలబడింది. పిన్ని వస్తే 'అంతలా అప్పజెప్పి వెళితే ఏమిటి చేస్తున్నా?'వని తిడుతుంది. అపర్ణకి కళ్ళంట నీళ్ళు తిరిగాయి.

అప్పుడే వీధిలో నుంచి వచ్చిన మోహన్ స్టవ్ మీద కూరనీ, అపర్ణనీ మార్చి మార్చి చూసి పగలబడి నవ్వాడు ... 'వంటలో కొత్త కొత్త ప్రాక్టికల్స్ చేస్తున్నావా? భేష్! అమ్మ ఏదీ?'' అడిగాడు.

''పిన్ని ... పిన్ని ...'' అంటూ తాయారమ్మ ఎక్కడికి వెళ్ళినదీ చెప్పి, తను రేపటి ప్రాక్టికల్స్‌కి ప్రిపేర్ అవుతూండగా కూర ఇలాగైందని చెప్పింది. మోహన్‌కి అపర్ణని చూస్తే జాలి వేసింది. పావం! తల్లిదండ్రులు పల్లెటూళ్ళో ఉండటం వల్ల చదువు మీది ఆసక్తి కొద్దీ తమ ఇంట్లో ఉండి చదువుకుంటోంది. ఇప్పు డేమైనా అంటే బద్దలయ్యే అగ్నిపర్వతంలా ఉంద.

''అన్నయ్యా! పిన్ని చూస్తే దెబ్బలాడుతుం దేమో!'' అంది.

''నేను బజారుకి వెళ్ళి ఒక అరకేజీ దొండకాయలు తెస్తాను. మళ్ళీ కమ్మగా వేయించి పెట్టు. ఈ సంగతి మనం ఎవ్వరికీ చెప్పొద్దు. ఓ.కే.!' అంటూ వెంటనే లూనా మీద వెళ్ళిపోయాడు.

అపర్ణ మనసు తేలికపడింది.

** ** **

ఆ రాత్రి అపర్ణ నవల సగమే చదవగలిగింది. మర్నాడు ప్రాక్టికల్స్, రికార్డ్స్, తాయారమ్మ ఎక్కడికో వెళ్ళడంతో ఇంటి పని ... చాలా బిజీగా ఉండి నవలను పూర్తి చేయకుండానే ప్రమీల కిచ్చేసింది. మళ్ళీ వీలైతే తెచ్చి ఇమ్మని చాలాసార్లు అడిగింది ప్రమీలని. కాని ఆమె ఇవ్వలేదు.

ఒంటరిగా ఉన్నా తీరికగా ఉన్నా అపర్ణకి ఆ నవలలోని హీరో, హీరోయిన్లు ... వారి డైలాగ్‌లు, చిలి ...లు గుర్తొచ్చి పిచ్చెంకించేవి.

ఆ రోజు ఆదివారం. స్వాతి బీచ్‌కి వెళ్దామని పట్టుబట్టడంతో అపర్ణ స్కై బ్లూ కలర్ చీర, అదే రంగు బ్లౌజు వేసుకుని బయలుదేరింది. బీచ్‌కి వెళ్ళగానే స్వాతికి ఎవరో ఫ్రెండ్స్ కనిపించి, వాళ్ళతో వెళ్ళిపోయింది. ఒంటరిగా మిగిలిపోయిన అపర్ణ అలా ఆలోచిస్తూ, అలల కేసి చూస్తూ సముద్రం వైపు రెం డడుగులు వేసిందో, లేదో, పెద్ద కెరటం ఉవ్వెత్తున లేచి అపర్ణను ఆపాదమస్తకం తడిపేసింది. పరధ్యానంగా నడుస్తున్న అపర్ణ కాలి కింద ఇసుక జారి భయంతో కెవ్వున కేక వేయడం, ఎదురుగా ఉన్న మనిషి ఆమెని ఒడిసి పట్టుకోవడం క్షణంలో జరిగిపోయాయి.

అప్పుడు చూసింది అపర్ణ అతన్ని. ఆరడగుల పొడవు కాకపోయినా ఇంచుమించు అలాగే ఉన్నాడు. టక్ చేసిన ఫాంటు, షర్టు, ఉంగరాల జుట్టు కాకపోయినా ఒత్తైన క్రాపు. నీటుగా, డిగ్నిఫైడ్‌గా అచ్చం తను చదివిన నవలలోని హీరోలా గున్నాడు. ఆ హీరో - హీరోయిన్‌ల కలయిక కూడా మొదటిసారిగా బీచ్‌లోనే అయింది. ఏదో ఊహించుకున్న అపర్ణ సిగ్గుతో తల దించుకుని దూరంగా జరుగుతూ ''సారీ!'' అంది.

''ఇట్సాల్‌రైట్!'' అన్నాడు అతను దూరంగా జరుగుతూ.

అది వాళ్ళ తొలి పరిచయం.

ఆ తర్వాత ప్రతి ఆదివారం కలుసుకుంటూనే ఉన్నారు - పార్క్‌లో, బీచ్‌లో, హొటల్స్‌లో. కలుసుకున్నప్పుడల్లా కాలం క్షణాల్లో దొర్లిపోతోంది మళ్ళీ ఎప్పుడు, ఎక్కడ కలుసుకునేది అపర్ణ ముందుగానే నిర్ణయించుకుని చెప్తే, అతను వస్తున్నాడు. ఇప్పుడు అపర్ణకి ఇంట్లో ఉన్నంతసేపూ ఏదో పని, చదువు. లేకపోతే రికార్డు రానుకుందుకి వెళ్ళాలనో, ప్రాక్టికల్స్ క్లాస్ ఉందనో సాకులు ... ఆ పైన విజయ్‌తో కాలక్షేపం!

'విజయ్!' పే రెంత బాగుంది? మనిషిలాగే!

''విజయ్! నా ప్రేమ సామ్రాజ్యాన్ని జయించేశావు ... నువ్వు లేకుండా నేను బ్రతకలేను విజయ్! నిజం!''

''ఫొటో అడిగితే లే దన్నావు. నీ తైలవర్ణ చిత్రాన్ని ఏనాడో నా మనోఫలకం మీద ముద్రించుకున్న నాకు నీ ఫొటో ఎందుకు విజయ్?''

''ప్రేమ గురించి మీ అభిప్రాయం అని అడిగితే సృష్టిలో తీయనిది ప్రేమ ... అనంతమైనదీ, అపారమైనదీ ప్రేమ అన్నావు. అచ్చు ఆ నవలలోని హీరో మాట లివి!''

ఇవన్నీ అపర్ణ విజయ్‌తో మాట్లాడిన మాటలు కావు. తన గదిలో ఒంటరిగా తనలో తను నెమరువేసుకుంటున్న స్వగతాలు.

** ** **

''నా గురించి మీ అభిప్రాయం?'' అడిగింది అపర్ణ ఇసుకలో పిచ్చిగీతలు గీస్తూ.

''అందం, ఆకర్షణ కలబోసుకున్న మీ గురించి నా అభిప్రాయం ఏమని చెప్పను?'' తన ప్రశ్నలోనే సమాధానం చెప్పిన తీరు చూసి విజయ్ నభినందించకుండా ఉండలేకపోయింది.

''మీరు చాలా చక్కగా మాట్లాడతారు. చాలా రోజుల నుంచి మిమ్మల్ని నే నొక విషయం అడగా లనుకుంటున్నాను'' అంది అపర్ణ సంకోచంగా.

''....''

''మీరు 'లవ్ మేరేజ్' నవల చదివారా?'' అంది.

''ఎవరు రాసినది?''

''సారధిగారు రాసింది. చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది చదువుతూ ఉంటే ...'' అంది అపర్ణ అందులోని ఒకటి రెండు డైలాగులు చెబుతూ.

''మీరు సారధి రాసిన నవల లన్నీ చదువుతారా?'' అన్నాడు విజయ్.

''ఒకటీ రెండు మాత్రమే చదివాను. అందులో 'లవ్ మేరేజ్' నాకు చాలా నచ్చింది. కాని పూర్తిగా చదవడానికి వీలు పడలేదు. మీకు ఎక్కడైనా దొరికితే ఆ నవల తెచ్చిపెట్టండి'' అంది.

''అలాగే!'' అన్నాడు విజయ్.

** ** **

మ రొక రోజు - ''ఇక వారం రోజులతో నేను సెలవులకి మా ఊరు వెళ్ళిపోవాలి'' అంది అపర్ణ దిగులుగా.

"మళ్ళీ ఎన్నాళ్ళకి వస్తారు?" అన్నాడు విజయ్.

బహుశా మరి రాకపోవచ్చు. ఫైన లియర్ అయిపోయిందిగా! ఇక చదువు మానిపించి ఇంట్లో ఆ పల్లె టూళ్ళో కూర్చోవలసిందే." అపర్ణకి కళ్ళు చెమ్మగిల్లాయి. "విజయ్ మిమ్మల్ని వదిలి వెళ్ళిపోవా లంటే బాధగా ఉంది. మరి మీకు?" కళ్ళు పైట చెంగుతో ఒత్తుకుంది అపర్ణ.

"ఛ! ఏడవకండి. మళ్ళీ కలుస్తాం కదా! బాధపడకండి." అపర్ణ చేతిమీద చేయి వేస్తూ అన్నాడు విజయ్.

ఆ స్పర్శ దూరం కాకుండా తన రెండో చేతితో విజయ్ చేతిని గట్టిగా పట్టుకుంది అపర్ణ.

"విజయ్! ఐ లైక్ యూ ... ఐ లవ్ యూ" అంది విజయ్ చేతిని సుతారంగా ముద్దుపెట్టుకుంటూ.

"ఐ టూ!" అన్నాడు విజయ్ పరవశంగా.

అప్పుడే ప్రారంభమైన చిరుజల్లు పూలవానలా కురిసింది.

** ** **

"విజయ్! విజయ్! విజయ్!

కన్ను మూసినా, తెరిచినా అపర్ణ కదే రూపం ప్రత్యక్ష మవుతోంది. విజయ్! ఇంకా ఎన్నాళ్ళీ విరహం? నీ మనసులో ఏ ముందో నాకు తెలియదు. నేను మాత్రం నీ ప్రేమలో మునిగి పిచ్చిదా న్నయిపోతున్నాను. ఇక రెండు రోజులలో నాన్న వచ్చి నన్ను తీసుకు వెళ్ళిపోతారు. నిన్ను చూడకుండా ఒక్క రోజైనా ఉండలేని నేను ఎలా జీవించగలను? చెప్పు విజయ్! నాన్న నాకు పెళ్ళి సంబంధ మేదో చూశానని కూడా బాబాయికి ఉత్తరం రాశారు. కాని అణు వణువులో నిన్ను నింపుకున్న నేను మ రెవరి సొంత మెలా అవగలను? ప్లీజ్! నా చేయి అందుకుని ఎక్కడికో దూరంగా, సుదూరంగా తీసుకుని వెళ్ళిపో విజయ్! నా మనసులో మాట నేను ధైర్యంగా చెప్పినా, కుల మతాల ప్రాతిపదిక మీద నిల్చున్న నా తల్లిదండ్రులు ఎప్పుడూ అంగీకరించరు. ఆ విషయం నాకు బాగా తెలుసు. అందుకే ఎవ్వరికీ తెలియకుండా ఎక్కడికైనా నన్ను తీసుకుపో విజయ్!


అపర్ణ మనసు మూగగా రోదిస్తోంది. పక్క మీద అటూ, ఇటూ అసహనంగా కదిలింది. సరిగ్గా ఆ నవలలోని హీరోయిన్ పరిస్థితే తనకూ ఎదురైంది. ఇప్పు డేం చేయాలి? ఆ హీరోయిన్ చేసినట్లు తను కూడా ధైర్యం చేసి విజయ్‌ని రిజిస్టర్ మేరేజ్ చేసుకుంటే?

ఇలా రకరకాల ఆలోచనలతో సతమత మవుతూ చివరికి ఒక నిర్ణయానికి వచ్చి కళ్ళు మూసుకుంది అపర్ణ.

** ** **

"ఊఁ! చాలా ఇంటెరెస్టింగ్‌గా ఉంది. తర్వాత ఏం జరిగిందో చెప్పు." అన్నాడు కళ్యాణ్ ఉత్సాహంగా ముందుకి వంగుతూ.

"ఏముంది? మర్నాడు రాత్రి పెట్టెతో వచ్చి నా రూమ్ తలుపు తట్టింది" అన్నాడు కుర్చీలో వెనక్కి వాలుతూ విజయ్.




"వెరీ గుడ్! ఆ రాత్రి నీకు శివరాత్రి అయి ఉండాలి. యా మై కరెక్ట్?" అన్నాడు కళ్యాణ్.

"నో! అలా జరగలేదు. సగటు మగవాడిగా నేను ఆలోచించి ఉంటే ఏం జరిగేదో చెప్పలేను గాని ... నా వృత్తికీ, ప్రవృత్తికీ మధ్య సంఘర్షణ ప్రారంభమై నా వృత్తి జయించింది."

అర్థం కానట్లు చూశాడు కళ్యాణ్. "సస్పెన్స్‌తో చంపక నువ్వు ఆ రాత్రి ఎలా ఎంజాయ్ చేసిందీ చెప్పవోయ్!" అన్నాడు.

"అర్ధరాత్రి ఒంటరిగా నా గదికి వచ్చి నన్నే నమ్ముకున్న ఒక అందాల రాశిని చూసి మనసు చలించిన మాట వాస్తవమే! కాని, మరుక్షణం కర్తవ్యం నా వెన్ను తట్టింది. నీకు చెప్పాను కదా 'లవ్ మేరేజ్' నవల చదివి అపర్ణ చాలా ఇంప్రెస్ అయిందని. ఆ నవల తను పూర్తిగా చదవలేదట. సగం చదివిన అపర్ణ చివరలో ఏం జరిగిందో కూడా తెలుసుకోలేదు. జీవితంలో 'ప్రేమ' అంటే సరైన అవగాహన లేకుండా చదివిన ఒక నవలనో, చూసిన ఒక సినిమానో తమ జీవితానికి అన్వయించుకుంటూ అపర్ణలాంటి ఎందరో తమ జీవితాలను పాడుచేసుకుంటున్నారు. అలాంటివారికి 'కనువిప్పు' కలిగించే నవల 'లవ్ మేరేజ్'. ఆ విషయం ఆఖరిలో తెలుస్తుంది. ఒక సినిమా చూసి 'ప్రేమ వల'లో చిక్కుకుని, చివరకు బ్రోతల్ హౌస్‌లో జీవితం గడుపుతున్న 'ఒక అమాయకురాలి ఆత్మ కథ'ను చదివి, 'ప్రేమ' అంటే కేవలం ఇంట్లో నుంచి పారిపోయి తల్లి తండ్రుల ఇష్టాయిష్టాలకి వ్యతిరేకంగా పెళ్ళి చేసుకోవడం కా దనీ, నిజమైన థ్రిల్ పెళ్ళి చేసుకున్నాక భార్యా భర్త లిద్దరూ ఒకరి నొకరు ప్రేమించుకోవడంలోనే ఉంటుం దనీ చివరికి తెలియచెప్పిన నవల 'లవ్ మేరేజ్'. 'లవ్ మేరేజ్' అంటే 'లవ్ ఆఫ్టర్ మేరేజ్' అని తెల్పి చెప్పిన ఆ నవలని రాసిన విజయ సారధిని నేనే. అదే విషయం ఆమెకు తెలియచెప్పాను. అదీ కాకుండా ఇం కో నెల రోజుల్లో జరగబోయే నా పెళ్ళి కార్డు ఆమెకి చూపించాను. ఊహించని ఈ హఠా త్సంఘటనకి ఆమె బిత్తరపోయింది. 'పెళ్ళి నిశ్చయమైం దన్న విషయం ఇన్నాళ్ళూ నా దగ్గర దాచి నన్ను మోసం చేశా' వంది. 'నీలాంటి రచయితలు సంఘానికి చీడపురుగు' లంది. ఇం కేమేమో ఆ కోపంలో తిట్టింది. అన్నింటికీ ఓర్చుకున్నాను. కారణం ... కొంతవరకు నా తప్పు కూడా ఉంది గనుక ..." అని కాస్సే పాగాడు విజయ్.

"నీ తప్పా? అ దేమిటి?" అన్నాడు కళ్యాణ్ ఆశ్చర్యంగా.

"ఆమెతో నా పెళ్ళి విషయం ప్రస్తావిస్తే మళ్ళీ మళ్ళీ ఆమెను కలుసుకునే ఛాన్స్ ఉండ దని అలా చేశాను. అది నా తప్పే కదూ?" సిగరెట్ వెలిగించాడు విజయ్.

"ప్రొసీడ్ విజయ్!" అన్నాడు కళ్యాణ్.

"ఆ పరిస్థితులలో ఒంటరిగా వదిలేస్తే ఏ అఘాయిత్యం చేస్తుం దో నని ఆమె పిన్నీ బాబాయిలకి కబురు చేసి మర్నాడు ఉదయం ఆమె నప్పజెప్పాను."

"వెరీ గుడ్! సంఘ సంస్కర్త వనిపించుకున్నా వన్న మాట అందరిచేత!" అన్నాడు కళ్యాణ్ ఎగతాళిగా.

"అక్కడే పొరపాటు పడ్డాను నేను కూడా. వా ళ్ళమ్మాయి అమాయకురా లనీ, నేనే మాయమాటలు చెప్పి రప్పించా ననీ అలా పురుష ప్రపంచాన్నే దుమ్మెత్తిపోశారు వా ళ్ళిద్దరూ." సిగరెట్‌ను యాష్ ట్రేలో విదిలిస్తూ అన్నాడు విజయ్.

"ఐ పిటీ యూ విజయ్!"

"ఇప్పుడు చెప్పు కళ్యాణ్! నేను చేసిన పని మంచిదా, చెడ్డదా?"

"నీ కేమనిపిస్తోంది చెప్పు?" తిరిగి ప్రశ్నించాడు కళ్యాణ్.

"నాకా? నలుగురిచేత దోషి ననిపించుకున్నా

## మళ్ళీ

"లాటరీలో లక్ష రూపాయలు వచ్చినా నీ పాత బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. ఇంకా అడుక్కుంటున్నా వేంటి?"

"అదే తమాషా - అప్పుడు ఒకతను చీకట్లో తెలియక రూపాయి కాగితం అనుకుని లాటరీ టిక్కెట్టు వేశాడు. లక్కీ ఛాన్స్ కొట్టేశాం. మళ్ళీ అలా జరిగిందనుకోండి" ఆశగా చెప్పా డా భిక్షగాడు ఉరఫ్ లక్షాధికారి!

- కోలవల్లి [నెల్లూరు]

నా అంతరాత్మ ముందు నిర్దోషిగా త లెత్తుకు నిలబడ్డాను. నాకు ఆ తృప్తి చాలు." అన్నాడు విజయ్ లేచి నిలబడుతూ.

"నేమా నీతో ఏకీభవిస్తున్నాను." అన్నాడు కళ్యాణ్ చేయి అందిస్తూ. "అయినా నా కొక చిన్న డౌట్! ఆ విషయం అంతటితో మరిచిపోక ఇన్నాళ్ళ తర్వాత మళ్ళీ తవ్వుకుంటా వెందుకు?" అన్నాడు సందేహంగా.

"ఈ రోజు అపర్ణ కనిపించింది గనుక ..."

"అపర్ణా! ఈ ఊళ్ళోనా? నాకు కూడా చూపిద్దూ!"

"గోరంతలు కొండంతలు చేసి వచ్చని సంసారాలు చెడగొట్టడ మంటే ఈ లోకానికి పరమానందం. నా కారణంగా అపర్ణ కాపురంలో కలతలు వస్తాయేమో అని భయంగా ఉంది."

"అపర్ణకి పెళ్ళి అయిందా?" అడిగాడు ఆశ్చర్యంగా అడిగాడు కళ్యాణ్.

"ఇద్దరు పిల్లలు కూడా ... సాఫీగా సాగిపోతున్న ఆమె సంసారంలో ఎవరో పుట్టించే పుకారు వల్ల కలతలు రాకూడ దనే ముందు జాగ్రత్తగా నా నోటీతో నేనే నీకు అన్నీ వివరంగా చెపుతున్నాను.

"అంటే? నా కర్థం కాలేదు."

"అపర్ణ ఎవరో కాదు. నీ భార్య లలిత! ఇప్పుడు చెప్పు కళ్యాణ్! మనస్ఫూర్తిగా నేను నిర్దోషి నని నమ్ముత వా?" విజయ్ . రెండు చేతులూ పట్టుకున్నాడు. "ఆ సంఘటన మూలంగా లలిత నెప్పుడూ అపార్థం చేసుకో నని మాట ఇవ్వు" అర్థింపుగా అన్నాడు.

కళ్యాణ్ చిన్నగా నవ్వి - "పెళ్ళి అయిన రోజు రాత్రే లలిత నాకు ఈ విషయా లన్నీ చెప్పింది. అయితే ఆ విజయ్‌వి నువ్వే నన్న విషయం ఇప్పుడు తెలిసింది. లలిత నిజాయితీని ఆనాడు అభినందించలేకుండా ఉండలేకపోయాను. ఈనాడు నీ నిష్కల్మష హృదయాన్నీ మెచ్చుకోకుండా ఉండలేను. ప్రేమ నవలలు చదివి, సినిమాలు చూసి, విచక్షణ కోల్పోయి, జీవితలను సర్వనాశనం చేసుకుంటున్న కొంతమంది అమాయకులను నీ నవల 'లవ్ మేరేజ్'లో చక్కని గుణపాఠం చెప్పావు. ప్రేమ అంటే ఇంట్లో నుంచి పారిపోయి పెళ్ళి చేసుకోవడమే కాదనీ, పెళ్ళి తర్వాత ప్రేమించిన 'ప్రేమ' నిజమైనదనీ 'లవ్ మేరేజ్' అన్న పదానికి 'లవ్ ఆఫ్టర్ మేరేజ్' అర్థమనీ చెప్పిన తీరు సూపర్బ్! నీ గురించి చెబుతూ లలిత ఏమందో తెలుసా? విజయ్‌లాంటి మగవాళ్ళు నూటి కొక్కరు ఉన్నా ఆడవాళ్ళ మీద అత్యాచారాలు, వాళ్ళ అఘాయిత్యాలూ కొంతవరకూ తగ్గుత యంది. రియల్లీ షీ హేజ్ ఎ వెరీ గ్రేట్ ఒపినీయన్ ఎబౌట్ యూ అండ్ యువర్ పర్సనాలిటీ!"

"థాంక్యూ వెరీ మచ్ కళ్యాణ్! ఇన్నాళ్ళూ నేను తప్పు చేశా నేమో నని నాలో నేనే మథనపడుతున్నాను. ఈ రోజు నీతో అన్నీ చెప్పాక మనసు తేలికపడింది. నా వృత్తికి నేను రచయితగా కొంత న్యాయం చేకూర్చగలిగా నంటే నా కీ తృప్తి చాలు కళ్యాణ్! నా కీ తృప్తి చాలు!" విజయ్ కళ్ళల్లో ఆనంద బాష్పాలు నిలిచాయి. ★

## నాటి స్ఫూర్తి

### ఆ తృప్తి చాలు

కోనసీమలో ఒక వీధి బడిలో ఏకో పాధ్యాయుడిగా 1940 ప్రాంతంలో నియమితుడ నయ్యాను. ఆ కాలంలో మన దేశం స్వాతంత్ర్యోద్యమంతో అట్టుడికి పోతూంది. ఆ ప్రభావం గోదావరి నది గట్టున వెలసిన ఆ చిన్న గ్రామంపై మాత్రం కనిపించలేదు.

ఉద్యోగ బాధ్యతలను స్వీకరించగానే నా విద్యార్థుల్లో పరాయి ప్రభుత్వం పట్ల ద్వేష బీజాలు నాటడానికి ప్రయత్నాలు ప్రారంభించాను.

సెలవు రోజుల్లో పిల్లలు ఎక్కువగా గోదావరి నదిలో ఈతలు కొడుతూ ఆడుకునేవారు. ఆ సంవత్సరం దసరా సెలవుల్లో ఈతలు కొట్టాలని వరుగులెత్తే పిల్లలను అడ్డగించి వారికి కొత్త రకం ఆటను గురించి చెప్పాను.

'అయ్యవారికి చాలు అయిదు వరహాలు. పిల్లవాళ్ళకు చాలు పప్పుబెల్లాలు. ఆంధ్రులకు చాలు ఆత్మాభిమానాలు. తెలుగువారు తెంపాలి దాస్య శృంఖలాలు' అంటూ ఒక చిన్న గేయాన్ని పిల్లలకు రాగయుక్తంగా నేర్పించాను. పిల్లలతో కలిసి వెదురుపుల్లల ధనుర్బాణాలను కూడా ఏర్పాటు చేశాను. పిల్లల ముఠాతో కలిసి గ్రామంలోని ప్రతి గుమ్మం ఎక్కి, దిగాను. ప్రతి ఇల్లూ చేరగానే ముందుగా తర్ఫీదు పొందిన పిల్లవాడు విల్లెక్కుపెట్టి యజమాని పైకి బాణం వేసేవాడు. ఆ బాణం చివర కట్టిన బంతిపూలు ఆయనకు తగిలి ఆనందాన్ని కలిగించేవి. పిల్లల పాట కూడా తోడై నాకు అయిదు వరహాలు కాకున్నా ఒకటో, రెండో వరహాలు మాత్రం ప్రతి ఇంటా ముట్టాయి. పైగా ఆ ఊళ్ళో నా పలుకుబడి కూడా పెరిగింది.

సంక్రాంతి నెల పట్టారు. పిల్లలు గాలిపటాలతో తయారు. ఒక రోజు గాలిపటాలు ఎగురవేసే పిల్లలను చేరి వాళ్ళ కో సలహా ఇచ్చారు. నా మీద మీది గౌరవంతో పిల్లలంత కలిసి కాషాయం, తెలుపు, ఆకుపచ్చ కాగితాలను తెచ్చి గాలిపటాలను తయారుచేశారు.

నా వల్ల ఆ ఊళ్ళో కలిగిన సంచలనం అధికారులను చేరింది. నాకు హెచ్చరికలు అందాయి. నేను మాత్రం వాటిని లెక్క చేయలేదు. ఫలితం అందరికీ తెలిసిందే. నన్ను ఏమాత్రం సౌకర్యాలు లేని ప్రాంతలకు బదిలీ చేసేశారు. ఎక్కడికి పంపితేనేమి? వెదురు బద్దలకు, రంగు కాయితలకు కొదవ లేదు కదా? షరా మామూలుగానే నాకు వరహాలు, పిల్లవాండ్రకు పప్పుబెల్లాలు దొరికేవి. గాలిపటాలు వినువీధిలో మూడు రంగులతో సగర్వంగా ఎగురసాగేవి.

ఏ మారుమూలలకో, కొండకోనలకో బదిలీ చేసినా నా దారి మార్చుకోకుండా పిల్లల్లోనూ, చుట్టుపక్కలవారిలోనూ దేశభక్తి బీజాలు నాటగలిగానన్న తృప్తి ఈనాటికీ నాలో చెక్కుచెదరక నిలచి ఉంది. ఈ జన్మకు నా కీ ఆనందం చాలు.

- కందాటి ఆదెయ్య [లేబూరు]

